కథ

ఆదుర్తి బాల

# సుజాత మారిపోయింది

**"ఇవాళ మనం సినిమా ప్రోగ్రాం పెట్టుకున్న సంగతి మీకు తెలుసు కదా" చిటపటలాడింది సుజాత.**

**"అవుననుకో, కానీ వాళ్లు ఫోన్ చేసి మేం మీ ఇంటికి వస్తున్నామని చెబితే మీరు రాకండి మేం సినిమాకెళ్ళాలి అని చెప్పమంటావా?" అన్నాడు రఘు.**

''అందులో నాకేం తప్పు కనిపించడంలేదు. వాళ్లు ఇక్కడికొస్తామని చెప్పడానికి ఫోనెందుకు చేశారు? మనం ఆ టైంలో ఫ్రీగా వుంటామో లేదో తెలుసుకోడానికేగా. అలాంటప్పుడు మేం సాయంత్రం ఫ్రీ కాదు, రేపు రండి అని చెప్పడంలో తప్పేంటి?'' రెట్టిస్తున్నట్టుగా అన్నది సుజాత.

''నువ్వు చాలా సెల్ఫిష్‌గా ఆలోచిస్తున్నావు సుజా''

''అవునండీ నేను చాలా సెల్ఫిష్. నా అభిమాన హీరో సినిమా ఇవాళ చూడ్డానికి మెంటల్‌గా ప్రిపేరయిపోయాను నేను. సడన్‌గా ఆ ప్రోగ్రాం కాన్సిల్ అయితే నేనెంత అప్‌సెట్ అవుతానో మీరు ఆలోచించటడంలేదు''

''మంచి స్నేహితులతో సత్సంబంధాల కోసం ఒక్కోసారి మన ఇష్టాఇష్టాలను పక్కకు పెట్టక తప్పదు. సినిమా ప్రోగ్రాం రేపటికి వాయిదా వేసుకుందాం సరేనా?'' అనునయంగా అన్నాడు రఘు.

''మీరెప్పుడూ అంతే, ఎదుటి మనిషి కన్వీనియన్స్ గురించే ఆలోచిస్తారు. అయినా మనమేమీ సుస్తీచేసి మంచాన పడలేదుగా వాళ్లొచ్చి చూసెళ్లడానికి'' భర్త వంక గుర్రుగా చూస్తూ అన్నది సుజాత.

''అర్థం పర్థం లేకుండా మాట్లాడకు, వాళ్లిద్దరూ ఉద్యోగస్థులు. వాళ్లకున్న బిజీలైఫ్‌లో కూడా వీలు చూసుకుని మనింటికి వస్తున్నారంటే వాళ్లకి మనమంటే ఎంత అభిమానమో ఆలోచించు''

''వాళ్ల బ్లడీ రొటీన్ నుంచీ బయట పడి రిలాక్స వడానికి వస్తున్నారని ఎందుకనుకోకూడదు'' ఎదురు ప్రశ్నించింది సుజాత.

''అలా రిలాక్స్ అవడానికి మనింటికే రానక్కర లేదు. ఏ సినిమాకో, పార్కుకో వెళ్లొచ్చు''

''అవన్నీ డబ్బు ఖర్చు పనులు. ఫ్రీగా కాఫీ, టిఫిన్లు ఇవ్వడానికి నేనూ, కబుర్లతో వాళ్లని ఎంటర్‌టెయిన్ చేయడానికి మీరూ ఉండగా డబ్బు ఖర్చు చేసి రిలాక్స్ అవాల్సిన అవసరం వాళ్లకేంటి...''

సుజాత ఇంకా ఏదో అనబోతుండగా డోర్‌బెల్ మోగింది.

సుజాత కుర్చీలోంచీ లేచే ప్రయత్నం చేయలేదు. రఘునే లేచి వెళ్లి తలుపు తీశాడు.

ఎదురుగా నవ్వుతూ రవీంద్ర, జయంతి.

''రండి.. రండి..'' ముఖం మీదకి నవ్వు తెచ్చుకుంటూ అన్నాడు రఘు.

''బావున్నారా సుజాతగారూ?'' లోపలికొస్తూనే పలకరించింది జయంతి.

''ఆ.. బాగానే వున్నాను. మీలా బిజీగా ఉండనుగా ఆరోగ్య సమస్యలు తెచ్చుకోడానికి. మామూలు హౌస్ వైఫ్‌ని ఇంటిపట్టునే ఆరోగ్యంగా ఉంటాను'' పొడిగా అంది సుజాత.

జయంతికేం మాట్లాడాలో, సంభాషణని ఎలా పొడిగించాలో అర్థం కాలేదు. ఆ సమయంలో తాను రావడం సుజాతకి ఇంట్రస్టు లేదని మాత్రం అర్థమయింది.

రఘు, రవీంద్ర చిన్ననాటి నుండి కలిసి చదువుకున్నారు. ఉద్యోగాలు కూడా ఒకే ఊళ్లో అవడంతో వారి స్నేహం ఇంకా బలపడింది. రవీంద్ర తను పనిచేసే ఆఫీసులోనే జాబ్ చేస్తున్న జయంతిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. రఘు మాత్రం పెద్దలు కుదిర్చిన సంబంధం చేసుకున్నాడు. రవీంద్ర, జయంతి కలిసి అప్పుడప్పుడూ రఘుని, సుజాతని చూసి వెళుతుంటారు. సుజాత మాత్రం వారితో ఎప్పుడూ ముభావంగానే ఉంటుంది. కానీ జయంతి మాత్రం తన భర్తకీ, రఘుకీ ఉన్న స్నేహాన్ని గౌరవించి సుజాత ప్రవర్తనని పెద్ద సీరియస్‌గా తీసుకోదు.

తనంతట తనే చొరవ చేసి మాట్లాడినా సుజాత పొడిపొడిగా మాట్లాడడంతో జయంతి- రఘు, రవిల సంభాషణ వింటూ కూర్చుంది. రఘు వేసిన జోక్‌కి పకపకా నవ్వింది జయంతి.

'ఒళ్లంతా కదిలిపోయేట్టు ఆ నవ్వేమిటి? ఎంతయినా ఉద్యోగం చేస్తోంది కదా మగరాయుడిలా. స్త్రీ సహజమైన సిగ్గూ బిడియాలు మరచిపోయినట్టుంది' అనుకుంటూ టీ అయినా ఇవ్వకపోతే బాగుండదని వంటింట్లోకి దారి తీసింది సుజాత.

''వన్ మినిట్ రవీ..'' అంటూ భార్య వెనకాలే తనూ వచ్చాడు రఘు.

''సుజా! తినడానికి ఏమైనా పెట్టు వాళ్లకి. ఆఫీసు నుంచి ఇంటికెడితే ఇంక రావడం కుదరదని డైరెక్టుగా ఇటే వచ్చినట్టున్నారు'' అంటున్న భర్త వంక కోపంగా చూసింది సుజాత.

''అసలే మూడ్ ఆఫ్‌లో ఉన్నాను. ఇప్పుడు టిఫిన్లేమీ చేయలేను'' విసుగ్గా అన్నది సుజాత.

''ఇప్పుడు ప్రత్యేకంగా ఏమీ చెయ్యొద్దులే. మొన్న నువ్వు చేసిన కారప్పూస ఉందిగా. అదే ప్లేట్లలో సర్దేసి పట్టుకురా. ఫ్రిజ్‌లో స్వీట్సున్నాయిగా. కారప్పూసతో పాటు ఓ స్వీటు కూడా ఇస్తే బాగుంటుంది''

''ఆ కారప్పూస పిల్లలకోసమని దాచాను. కొద్దిగానే ఉంది''

''పిల్లలకి మళ్లీ చేయొచ్చులే. నీ చేత్తో చేసిన కారప్పూస అని చెప్తాను. వాళ్లు నిన్ను మెచ్చుకుంటారు. జయంతికి పాపం ఇలాంటి పిండి వంటలు చేతకావు'' అభ్యర్థనగా అన్నాడు రఘు.

''ఆవిడగారికి పిండివంటలు చెయ్యడం రాకపోతేనేం సంపాదించుకుంటోందిగా. బజార్లో బోల్డు వెరైటీలు కొనుక్కు తినగలదులెండి. నేను నా పిల్లలూ నా మొగుడి కోసం చేసినవి అందరికీ పంచి పెట్టలేను''

భార్య మొండి ధోరణికి చిరాకొచ్చింది రఘుకి. జయంతి అంటే ఎందుకో ఇష్టపడదు సుజాత.

''వాళ్లకేం పెట్టద్దులే. అంతా మనమే మింగుదాం. కనీసం టీ నీళ్లయినా తగలెయ్యి'' అంటూ విసురుగా వెళ్లిపోయాడు రఘు.

భర్తకి బాగా కోపం వచ్చిందని గ్రహించి ఇక తప్పదని కారప్పూస రెండు ప్లేట్లలో సర్ది తెచ్చింది సుజాత.

''ఇప్పుడెందుకమ్మా ఇవన్నీ'' అంటూ మొహమాటపడుతూనే తిన్నాడు రవీంద్ర.

''చాలా బాగుంది సిస్టర్. మీరే చేశారా? మా జయంతికి వంట చెయ్యడమే సరిగా రాదు. ఈమధ్యనే మా బాబాయ్ కొడుకు హైదరాబాదు సిటీ చూడడానికని ఫ్యామిలీని తీసుకుని వచ్చాడు మా



ఇంటికి.

ఓ వారం రోజులుంటాం, సిటీ అంతా చూపించరా అన్నాడు నాతో. పాపం ఎంత ఆశగా వచ్చారో అని నేను రెండు రోజులూ జయంతి రెండు రోజులూ సెలవుపెట్టి హైదరాబాదు అంతా తిప్పుదాం అనుకున్నాం. కానీ మొదటి రోజే మా జయంతి వంట రుచి చూసి పెట్టేబేడా సర్దేశారు. పాపం మా జయంతికేమో అతిధి సత్కారాలంటే మక్కువ. సిటీ చూడాలని వచ్చిన వాళ్లు అర్థాంతరంగా వెళ్లిపోవడమేమిటని నిలదీస్తుంది వాళ్లని. నీ వంట తినలేకే వెళ్లిపోతున్నామని ఎలా చెప్తారు వాళ్ల పాపం. ఒంట్లో బాగాలేదని ఒకరూ, హైదరాబాదు వరకి ఆయాసం వస్తోందని ఒకరూ లేని రోగాలు నటించి మరీ వెళ్లిపోయారు'' నవ్వుతూ చెప్పాడు రవీంద్ర.

జయంతి ఉడుక్కుంటూ చూసింది భర్త వంక. తర్వాత రవీంద్ర ముఖం ఎదురుగా గాలిలో చిటికె వేస్తూ ''హలో! ఆరోజు వంట చేసింది నేను కాదు బాబూ.. తమరే. నాకు ఆఫీసులో అర్జంటు పని పడింది, కాస్త వంట సంగతి చూసుకోండి అని నేను త్వరగా వెళ్లిపోయాను ఆరోజు. వంట గురించి నువ్వేం వర్రీ కాకు అంటూ మీ వంటతో వాళ్లని బెదరగొట్టింది మీరే''

''ఎవీ హా వంట ఎవరు చేశారన్నది క్వశ్చన్ కాదు, వచ్చిన వాళ్లు పారిపోయారా లేదా అన్నది పాయింట్'' రాజీకొచ్చాడు రవీంద్ర.

ఏ అరమరికలూ లేకుండా చిలకాగోరింకల్లా కలిసిపోయి చిన్నపిల్లల్లా వాదులాడుకుంటున్న వాళ్లని చూస్తే ముచ్చటేసింది రఘుకి.

వంట చేయడం చాతకాదనే విషయాన్ని ఎంత అందంగా చెప్పుకుంటున్నారు ఇద్దరూ. వంట రాకపోతే అదొక డిస్‌క్వాలిఫికేషన్‌గా చూసేవారు ఇదివరకూ. భర్తకు రుచిగా వండి పెట్టడం భార్య యొక్క కనీసధర్మంగా భావించి పెళ్లిచూపులకి వచ్చినప్పుడే అమ్మాయికి వంటావార్పూ వచ్చా అని అడిగి మరీ తెలుసుకునేవాళ్లు. కానీ ఇప్పుడో... వంట చేయడం రాదని చెప్పుకోవడం ఫ్యాషన్. ఈ మగాళ్లు కూడా అంతే, భార్య ఉద్యోగం చేస్తే చాలు, ఇంకే పని రాకపోయినా ఫరవాలేదనుకుంటారు'' సుజాత మనసు ఉడికిపోయింది.

''ఇక వెళ్లొస్తాంరా'' అంటూ లేచాడు రవీంద్ర.

''వస్తానండీ సుజాతగారూ. వచ్చే సండే రండి మా ఇంటికి. పిడి రోజుల్లో మాకు టైం ఉండదు కనుక, సండే నాడు వస్తే సరదాగా మా ఇంట్లో గడపొచ్చు'' హాండ్ బ్యాగ్ భుజానికి తగిలించుకుంటూ అన్నది జయంతి.

తప్పకుండా వస్తామంటూ హామీ ఇచ్చాడు రఘు.

''మీరు వెళితే వెళ్లండి. తప్పకుండా వస్తామంటూ నన్ను కూడా కలుపుతారెందుకు'' రవీంద్ర, జయంతి వెళ్లిపోయాక భర్త మీద కస్సుమంది సుజాత.

''నీ ధోరణి నాకర్థం కావటం లేదు'' విసుగ్గా అన్నాడు రఘు.

''అవును. మీకు అందరూ అర్థమవుతారు ఒక్క నేను తప్ప'' కోపం కాస్త ఏడుపులోకి దిగగా బొంగురు గొంతుతో అన్నది సుజాత.

''ఇప్పుడు నిన్ను కష్టపెట్టే మాట ఏమన్నానని.. అంతలా బాధపడడానికి'' సుజాత బాధకి కారణం ఏమిటో బోధపడక అన్నాడు రఘు.

''వేరే అనక్కరలేదు లెండి. మీకు కూడా మీ ఫ్రెండు లాగా ఉద్యోగం చేసే భార్య అయితే బాగుండేది. ఎంతయినా సంపాదించే భార్యని భర్త ఎప్పుడూ అపురూపంగానే చూసుకుంటాడు''

''ఇప్పుడు నువ్వు ఉద్యోగం చేయలేదని నేనన్నానా? ఉద్యోగం చెయ్యడం మానడం అనేది వ్యక్తిగత ఇష్టాఇష్టాలని బట్టి ఉంటుంది. నీ ఇష్టాఇష్టాలని

నేనెప్పుడు కాదన్నాను. ఎదుటి మనిషి ముందు నిన్ను కించపరిచే వ్యాఖ్యలూ చేయలేదు నేను''

''అయితే మాత్రం ఆ జయంతిని అంతగా పొగిడి ఆకాశానికి ఎత్తేయడం నన్ను కించపరిచినట్టు కాదా?'' ఉక్రోషంగా అన్నది సుజాత.

''జయంతిని నేనెప్పుడు పొగిడాను?'' ఆశ్చర్యపోయాడు రఘు.

''అప్పుడే మర్చిపోయారా? ఇందాక మీరే కదా అన్నారు.. జయంతి చాలా సిన్సియర్ అండ్ హార్డ్ వర్కర్ అని. ఆఫీసులో ఎటువంటి ప్రాబ్లమ్ వచ్చినా చిటికెలో పరిష్కరిస్తుందనీ''

అది పొగడ్త కాదనీ అందులో పిసరంత కూడా అబద్ధం లేదని తెలిసీ భార్యతో వాదించటం అనవసరం అని ఊరుకున్నాడు రఘు.

''అయినా ఈ ఉద్యోగం చేసే వాళ్లకి టైం లేదనడం ఊతపదంలాగా ఉంది. అంత టైం లేకుండా ఉద్యోగాలు చేస్తున్నది వాళ్లకోసమేగా. మనం ఒకసారి ఆటో ఎక్కి వెళ్లాలంటే పదిసార్లు ఆలోచిస్తాం. మరి వాళ్లో! సాధారణంగా ఆటోల్లోనే తిరుగుతారు. మనం ఇంటిల్లిపాదీ నెలకి ఒకసారి సినిమాకి వెళ్లాలంటే మన కుటుంబ బడ్జెట్‌లో ఎంత లోటు పడుతుందో అని ఆలోచిస్తాం. మరి వాళ్లో! సెలవురోజు వస్తే చాలు. ఇంటికి తాళం పెట్టి ఏ సినిమాకో చెక్కేస్తారు. వాళ్లు సంపాదిస్తున్నారు కాబట్టి మనకన్నా బాగా అనుభవిస్తున్నారు. కానీ అలా ఆలోచించకుండా ప్రతి మాటకీ ముందు టైం లేదని ఏడవడమెందుకు? అంతగా తీరుబడి దొరకాలంటే ఉద్యోగం మానేసి హౌస్ వైఫ్‌గా ఉండచ్చుగా. అందుకు ఒప్పుకుంటారా వీళ్లు.. అవ్వా బువ్వా రెండూ కావాలి. పైగా వాళ్లే కదా ఉద్యోగం చేస్తున్నామని సాటి ఆడవాళ్ల ముందు పోజు కొడతారు'' ఆవేశపడిపోయింది సుజాత.

కానీ ఆమె ఆవేశం వెనక ఉన్న ఆక్రోశాన్ని అర్థం చేసుకున్నాడు రఘు. సుజాత కూడా ఉద్యోగ ప్రయత్నాల్లో ఎన్నో పోటీ పరీక్షలు రాసింది. ఆమె దురదృష్టమో ఏమోగానీ కొన్ని ఉద్యోగాలకి ఇంటర్వ్యూలో ఫెయిలయితే, కొన్ని ఉద్యోగాలకి ఇంటర్వ్యూలకే సెలక్టు కాలేదు. దాంతో ఓ రకమైన నిరాశ, నిస్పృహ చోటు చేసుకున్నాయి ఆమెలో. ఎదిగిన పిల్లకి పెళ్లీడు దాటిపోతుందని ఆమె ఆంతర్యం అర్థం చేసుకోకుండా పెళ్లి చేశారు తల్లిదండ్రులు. తీరని కోరిక ఆమెలో కొన్నాళ్లు నిద్రాణమైపోయినా ఉద్యోగం చేసే ఆడవాళ్లని చూస్తే ఆ కోరిక అసంతృప్తి రూపంలో బయటికొస్తుంటుంది. అందుకే జయంతిని చూసినప్పుడల్లా సుజాతకి కలిగే అసంతృప్తి జయంతి మీద అసూయని అకారణ ద్వేషాన్ని కలగచేసింది. ఈ స్థితి నుంచి సుజాత బయటపడాలంటే ఆమెకిప్పుడు అర్జంటుగా ఓ ఉద్యోగం కావాలి. ఎస్... నేనిప్పుడు సుజాతని సేవ్ చేయాలంటే ఆమెకొక ఉద్యోగం సంపాదించిపెట్టాలి. దృఢంగా నిశ్చయించుకున్నాడు రఘు.

★ ★ ★

''సుజా! మా ఫ్రెండ్ ఒకడు ట్యుటోరియల్ కాలేజీ పెట్టాడట. మాథమేటిక్స్ చెప్పడానికి ఎవరైనా కాండిడేట్‌ని చూడమన్నాడు. నేను నీ పేరు చెప్పాను'' ఇంటికొస్తూనే అన్నాడు రఘు.

''నేనే.. నేను చెప్పగలనా?'' అపనమ్మకంగా అన్నది సుజాత.

''ఎందుకు చెప్పలేవు? ఆ సబ్జెక్టుతో పిజి చేశావు కదా.''

''అవుననుకోండి. నేను పుస్తకాలు తెరిచి చాలా రోజులైంది''

''ఏమీ పరవాలేదు. బుక్స్ తెరిచి ఓసారి రిఫర్ చేసుకో. అన్నీ అవే గుర్తొస్తాయి. పిల్లలందరూ స్కూల్‌కెళ్లిపోయాక ఊరికే కూర్చుని ఏం చేస్తావు?''

''కానీ.. ఏదో భయంగా ఉందండీ. పిల్లలు అడిగే డౌట్స్ క్లియర్ చేయలేకపోతే షేమ్ అయిపోతానేమో?'' భయంగా అన్నది సుజాత.

''పిచ్చిదానా! ఈ అపనమ్మకమే నిన్నీ స్థితికి తీసుకొచ్చింది. మనం ఎన్నో సాధించాలనుకుంటాం. కానీ అందుకు తగ్గ ప్రయత్నం చేయం. ఒక్కొక్కసారి ప్రయత్నించినా మన మీద మనకే నమ్మకం ఉండదు. ఒకటి రెండుసార్లు ఓటమిపాలైతే మళ్లీ ప్రయత్నించడానికే భయపడి అసలు లక్ష్యాన్నే వదిలేస్తాం. పోనీ అలా వదిలేసి ఊరుకోం కదా మనకున్న లక్ష్యాన్ని ఇంకెవరైనా సాధిస్తే వాళ్లని చూసి అసూయపడతాం. ఆ అసూయని సమర్థించుకోడానికి వారిలో లేని లోపాలని వెదుకుతాం. అలా అసూయతో బాధపడుతూ మన చుట్టూ ఉన్నవారిని కూడా బాధపెడతాం.. నా ఎనాలసిస్ కరెక్టయితే ఈ ఉద్యోగంలో చేరిన తర్వాత నువ్వు పూర్తిగా మారిపోతావు చూడు...'' నవ్వుతూ అన్నాడు రఘు.

★ ★ ★

''సారీనండి. ఈరోజు కూర బాగుండదని నాకు తెలుసు. అందులో వేయాల్సినవన్నీ వేసి వండే టైం లేదు. ఏం చెయ్యను. అసలే పరీక్షల టైం.. ప్రిన్సిపాల్‌కి నామీద కొండంత నమ్మకం సిన్సియర్‌గా ఉంటానని. అన్ని బాధ్యతలు నాకే అప్పగిస్తాడు'' చేతికి వాచీ పెట్టుకుని గడప దాటుతూ అంది సుజాత.

మనిషిలో ఆత్మవిశ్వాసం నింపడానికి అర్హతలని బట్టి ఎంతో కొంత ఆర్థిక స్వావలంబన అవసరం- నవ్వుకున్నాడు రఘు.

## ఇక్కడే ఉంటా

**'పెళ్ళిసందడి'లో సందడి చేసిన రవళి గుర్తుందా? ఆమెకి హైదరాబాద్‌లోనే ఉండాలని ఉందంట. అన్నట్టు ఈమె ఇప్పుడు ఏసుక్రీస్తు కథాంశంతో రూపొందిన శాంతి సందేశం చిత్రంలో నటిస్తోంది. వినోదం, శుభాకాంక్షలు, ఒరేయ్ రిక్షా చిత్రాల్లో నటించి ఈమధ్య వరకూ కనుమరుగైన ఈ బొద్దుగుమ్మ మళ్లీ ఇప్పుడు టాలీవుడ్‌లో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. 'నా సెకండ్ ఇన్నింగ్స్ గురించి నేను చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నాను. హైదరాబాద్‌లో ఇల్లు కొనుక్కుని ఇక్కడే ఉంటా' అని చెబుతోంది రవళి.**

